'ప్లాస్టిక్‌ను వినియోగించవద్దు'

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని 23 వార్డులో మహిళలకు తడిపొడి హానికరమైన చెత్త గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరూ తమ ఇంట్లోనే చెత్తను విభజించి మున్సిపల్ ట్రాక్టర్‌లో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ పృథ్వీరాజ్, మెప్మా ఆర్పీలు, కాలనీవాసులు పాల్గొన్నారు.




నిత్య జీవితంలో సైన్స్ చాలా ముఖ్యమైనది

- జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ప్రదర్శనలో విద్యాశాఖ జిల్లా అధికారి అశోక్

7లో..

ఎవరి ధీమా వారిదే!

- గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలకు పోలైన ఓట్లపై అభ్యర్థుల లెక్కలు
- ఓ అంచనాకు వస్తున్న ప్రధాన పార్టీలు అభ్యర్థులు
- ప్రత్యేక టీం ద్వారా పోలింగ్ సరళిపై ఆరా
- అన్ని జిల్లాల్లో జరిగిన పోలింగ్‌పై వివరాల సేకరణ
- గెలుపు, ఓటములపై ముందస్తుగా అంచనాకు వస్తున్న అభ్యర్థులు





నిజామాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ సరళిపై అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారిగా పోలైన ఓట్లను బట్టి తమ గ్రూపుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆయా జిల్లాల పరిధిలో తమకు ఎంతవరకు ఓట్లు పడ్డాయో అంచనాకు వస్తున్నారు. ఏఏ మండలం పరిధిలో తమకు ఎక్కువ మద్దతు వచ్చింది.. ఏ మండలం పరిధిలో తక్కువగా ఓట్లు పడ్డాయి.. అనే అంశాలపై ఆరా తీయడంతోపాటు గెలుపు, ఓటములపై అంచనా వేస్తున్నారు. ఆయా జిల్లాల పరిధిలో తమ పార్టీల నేతలు ఎవరు సహకరించారు, ఎవరు అంతగా పనిచేయ లేదో, ఓటింగ్ తగ్గడానికి కారణాలపై వివరాలను తీసుకుంటున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో పడిన ఓట్లకు అనుగుణంగా గెలుపు, ఓటములపై అంచనాకు వస్తూ తమ మద్దతుదారులతో చర్చిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోపాటు రెండో ప్రాధాన్యత ఓట్లపై ఆరాతీస్తూ కౌంటింగ్ కోసం ఎదు రు చూస్తున్నారు. ముందుగానే తమ సంస్థల ద్వారా చేసిన సర్వేలతో పాటు ఇంటెలిజెన్స్ ఏజెన్సీల ఫీడ్‌బ్యాక్‌ను తీ సుకుంటూ ఒక ధీమాకు వస్తున్నారు.

భారీ పోలింగ్

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ దఫా భారీ పోలింగ్ జరిగింది. గ్రాడ్యుయేట్‌తో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటర్లు ఎక్కువ మొత్తంలో తరలివచ్చారు. క్యూ కట్టి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ దఫా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎక్కువ మొత్తంలో ప్రచారం చేశారు. నోటిఫికేషన్ ముందే ఈ ఎన్నికలపై దృష్టిపెట్టి పనిచేశారు. గ్రాడ్యుయేట్‌లను ఓటరుగా నమోదు చేయించడంతో పాటు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆయా మండలాలు, నియోజకవర్గాల్లో జరిగే సమావేశాల్లో పాల్గొన్నారు. ఎక్కువ మొత్తంలో ప్రచారం నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చే విధంగా చూశారు. సొంతటీమ్‌ల ద్వారా ప్రచారాన్ని కొనసాగించారు. కాల్‌సెంటర్లను ఏర్పాటుచేసి ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేశారు. వీరికి ధీటుగానే బీఎస్పీ అభ్యర్థి కూడా పూర్తిస్థాయిలో ప్రచారంపై కేటాయించడంతోపాటు సొంతటీమ్‌ల ద్వారా ప్రచారాన్ని కొనసాగించారు. అన్నిపార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు చేసిన ప్రయత్నాలతో ఈ దఫా గ్రాడ్యుయేట్‌తోపాటు టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ పెరిగింది.



ఓటింగ్ సరళిపై అంచనాలు

ఈ దఫా పోలింగ్ శాతం పెరగడంతో ప్రధాన అభ్యర్థులు ఓటింగ్ సరళిపై అంచనాకు వస్తున్నారు. కాంగ్రెస్ తరపున పోటీచేసిన నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణలు ఎవరికి వారే ఓటింగ్ సరళిని పోలింగ్ కేంద్రాల వారిగా పరిశీలించడంతోపాటు తమకు పడిన ఓట్ల శాతంపై ఆరా తీస్తున్నారు. పూర్తిస్థాయిలో క్యాడర్‌తోపాటు సొంత టీమ్‌లను వినియోగించడంతో ఏ పోలింగ్ బూత్ పరిధిలో ఎన్ని ఓట్లు తమకు అనుకూలంగా పడ్డాయో వివరాలను సేకరిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు రెండో ప్రాధాన్యత ఓట్లపైన చర్చిస్తున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక గెలుపు ఓటములపై ఉత్కంఠ నెలకొనగా అభ్యర్థులు మాత్రం పూర్తిస్థాయిలో అంచనా వేస్తు న్నారు. పోలింగ్ శాతం పెరగడం ఎక్కువ మొత్తంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడంతో మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవడం కష్టమేనని అభ్యర్థులు అంచనాకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండటం కొంతమంది స్వతంత్రులు (తరువాయి 8వ పేజీలో..)



మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు

నేడు బాబ్లీ గేట్ల ఎత్తివేత

- 0.6టీఎంసీల నీటిని విడుదల చేయనున్న అధికారులు

మెండోర, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్టు ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నేడు ఎస్సారెస్పీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు ప్రాజెక్టు అధికారులు బృందం బాబ్లీ ప్రాజెక్టుకు వెళ్లి బాబ్లీ ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రాజెక్టు గేట్లను ఎత్తి 0.6టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఈ నీటి విడుదల కేంద్ర జల సంఘం అధికారులతో కలిసి ఇరు రాష్ట్రాల ప్రాజెక్టు అధికారులు పాల్గొంటారని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.

31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై 25 శాతం రిబేట్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- కొత్త దరఖాస్తులకు అవకాశం
- అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో సహాయక కేంద్రాలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220183

..... వివరాలు 8లో

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సెల్‌ఫోన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దు
- వీసీ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఈనెల 5న తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సీఎస్ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు, కాపీయింగ్‌కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్‌లను అనుమతించవద్దని చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో పాటు కేంద్రాలను తనిఖీ చేసేందుకు వెళ్లే అధికారులు సైతం సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే లోనికి అనుమతించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ పరీక్షల నిర్వాహణపై వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్షకేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తీసుకురావడం మొదలుకొని పరీక్షలు ముగిసిన మీదట జవాబు పత్రాలను నిర్ధీత పాయింట్‌కు తరలించే వరకు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతీ కేంద్రంలోనూ పరీక్షల నిర్వహణ తీరును చీఫ్ సూపరింటెండెంట్‌లు నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో పాటు ఏ ఒక్కరు కూడా పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లకుండా (తరువాయి 8వ పేజీలో..)




వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి



చివరి ఆయకట్టుకు చుక్క నీటి సరఫరా లేకుండా పోయిన సాగునీటి కాలువ



పోతంగల్ వద్ద తక్కువ స్థాయిలో సరఫరా అవుతున్న నీరు



కొల్లూర్ శివారులో ఎండుతున్న వరి పంట




శేషాద్రి ఫారంలో ఎండుతున్న వరి పైరును చూపుతున్న రైతు

సాగునీరు అందక ఎండుతున్న వరి!

- నిజాంసాగర్ కెనాల్ గేజ్ తగ్గించిన అధికారులు
- నిలిచిన నీటి సరఫరా
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు

50 ఎకరాల్లో పంట ఎండుతోంది

- రాంబాబు, రైతు, శేషాద్రి ఫారం



50 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నా. పంట పొట్ట దశలో ఉంది. కాలువను అనుకుని ఉన్న తూము వద్దకు సాగర్ నీరు అందడం లేదు. వారం రోజుల నుంచి నీటి లేక పంట ఎండుముఖం పడుతోంది. అధికారులు తక్షణమే స్పందించి పంటలకు నీరందించాలి.

చివరి ఆయకట్టుపై నిర్లక్ష్యం

- వాసు రైతు - హెగ్డోలి



చివరి ఆయకట్టుపై ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మా పంటలు ఎండుతున్నాయి. బోధన్, సాలూర మండలాలకు నీటిని ఎక్కువ మొత్తంలో తరలించడంతో మా ప్రాంతానికి నీటిసరఫరా తగ్గింది. అధికారులు పట్టించుకోకపోతే మేము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

కోటగిరి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): పంటలకు నీరు అందక వరి ఎండిపోతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉండడంతో జిల్లారైతులు పెద్దఎత్తున వరి పంటలు సాగుచేశారు. ఇప్పటివరకు నాలుగు తడులుగా నీటి విడుదల చేసిన అధికారులు చివరి ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం రైతుల పాలిట శాపంగా మారింది. తమ కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతున్నాయని పొతంగల్ మండలంలో నిజాంసాగర్ చివరి ఆయకట్టు రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉండగా నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సాగు నీరు అందించాలని పొతంగల్ మండలంలోని శేషాద్రిఫారం రైతులు శుక్రవారం రోడ్డుపై నిల్చొని నిరసన తెలిపారు.

కోటగిరిలో పెద్దఎత్తున వరి సాగు..

మండలంలోని హెగ్డోలి, కొల్లూర్, సుంకిని, కారేగాం, టాక్లి, సోంపూర్, దోమలెడ్గి శివారు నిజాంసాగర్‌కు చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో రైతులు పెద్దఎత్తున వరి పంటలు సాగుచేశారు. మూడు తడుల వరకు సక్రమంగా నీటి సరఫరా జరగడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండాపోయాయి. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. నీరు పుష్కలంగా అందాల్సిన సమయమిది. ఫిబ్రవరి 20న నాల్గో విడత నిజాంసాగర్ నీటిని విడుదల చేశారు. డీ-28 ప్రధాన కాలువ కింద పలు ఉప కాలువలు ఉన్నాయి. డీ-28/1/2 కాలువ కింద రైతులకు నిజాంసాగర్ నీరు అందడం లేదు. డీ-28 ప్రధాన కాలువలో బోధన్, సాలూర మండల రైతులు నీటిని తమవైపు ఎక్కువగా తీసుకువెళ్తుండడంతో పొతంగల్ మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన కాలువ నుంచి ఎక్లాస్‌పూర్ చెరువుకు సుమారు 3ఫీట్ల గేజ్‌తో చెరువులో నీరు పడాల్సి ఉంది. చెరువు నుంచి కింది భాగంలో 8 చెరువులతోపాటు చివరి ఆయకట్టుకు సాగు నీరు అందాలంటే అదే గేజ్‌తో నీటిని కిందికి సరఫరా చేయాల్సి ఉంది. 3 ఫీట్ల సమాంతరంగా నీటిని విడుదల చేయకుండా తక్కువగా విడుదల చేయడంతో ఎక్లాస్‌పూర్ నుంచి పొతంగల్, హంగర్గ ఫారం వరకు నీటి సరఫరా అంతతమాత్రంగా కొనసాగుతోంది. చివరి ఆయకట్టు గ్రామాలైన హెగ్డోలి, శేషాద్రిఫారం, సుంకిని, కొల్లూర్ ఆయకట్టుకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వారం రోజుల నుంచి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వరి పంటలు కాపాడుకునేందుకు బోర్లపై (తరువాయి 8వ పేజీలో..)



జీపీ భవనంలో అధికారులను నిర్బంధించిన దృశ్యం

అధికారులను నిర్బంధించిన రైతులు

- తమ పంట పొలాలకు సాగునీరు అందడం లేదని ఆగ్రహం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలూర క్యాంప్ గ్రామ రైతులు శుక్రవారం ఇరిగేషన్ అధికారులను గ్రామ పంచాయతీలో నిర్బంధించారు. నిజాంసాగర్ నీటిని విడుదల చేసి 7రోజులు కావస్తున్నా సాలూర క్యాంప్, కొప్పర్తి క్యాంప్, జాడి గ్రామాల చివరి ఆయకట్టుకు నీరు అందడం మండిపడ్డారు. అధికారులు గ్రామానికి పిలిచి (తరువాయి 8వ పేజీలో..)



పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్‌కుమార్

ఆస్తి పన్ను చెల్లించని దుకాణాల సీజ్

- సకాలంలో పన్నులు చెల్లించకుంటే చర్యలు
- నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తి పన్ను చెల్లించని పలు దుకాణాలను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఆస్తి పన్ను చెల్లించకుంటే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ దిలీప్‌కుమార్ ఆస్తి పన్ను చెల్లించని దుకాణ సముదాయాలకు వెళ్లి పన్ను చెల్లించాలని కోరారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రముఖ వ్యాపార సంస్థలైన అరోన్ ఐస్‌క్రీమ్, విశాల్‌మార్ట్, ఎల్‌జీ షోరూం, తదితర వ్యాపార సముదాయాలను సందర్శించి ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు. సుమారు రూ.30వేల నుంచి రూ.6లక్షల వరకు వివిధ వ్యాపార సముదాయాలు పన్ను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాయని, వెంటనే ఆస్తిపన్ను చెల్లించాలని అన్నారు. పన్ను చెల్లించని వ్యాపార సముదాయాలను సీజ్‌చేశారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, అధికారులు జైకుమార్, మురళి ఉన్నారు.

నీటి సమస్యను తీర్చేలా కృషి చేస్తా..

సారంగపూర్ ప్రాంతంలోని 13వ డివిజన్ వాసుల తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని నగర మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సారంగపూర్‌లో ధర్నా నిర్వహించిన మహిళలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకొని పైప్‌లైన్ మరమ్మతులను వెంటనే చేయించారు. మిషన్‌భగీరథ నీరు కూడా ఇంటింటికీ వస్తోందని, రాని ఇళ్లకు నీటిని సరఫరా అయ్యేలా చూస్తామని వెల్లడించారు.

నవీపేట ఆసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్

నవీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ నివారణ మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచడంతో పాటు మెరుగైన ఓపీ సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను స్వయంగా పరీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, మెడికల్ ఆఫీసర్ కావ్య ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాక్‌పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు పార్లమెంట్‌లోని విధివిధానాలు, బిల్లుల రూపకల్పన ఏ విధంగా జరుగుతుందో, పార్లమెంట్ సభ్యులు స్పీకర్ బాధ్యతలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సులోచన, సుష్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



సన్మానిస్తున్న సంఘ సభ్యులు

పెర్కిట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టైలర్ డేను పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని మేరు సంఘంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్బూరు వినోద్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులవృత్తిలో రాణిస్తున్న పలువురిని ఎంపిక చేసి వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మేరు సంఘం అధ్యక్షుడు రాజుల్‌దేవి రవినాథ్, ప్రధాన కార్యదర్శి దీకొండ లక్ష్మణ్, కోశాధికారి సంఘావి గంగాధర్ మాట్లాడుతూ ఈ వృత్తి చాలా ప్రాధాన్యమైందన్నారు. కార్యక్ర మంలో సంఘ సభ్యులు కొట్బూరు సురేష్, గంగాధర్, సంఘ శ్రీనివాస్, రాచర్ల శ్రీనివాస్, రాంగిరి కృష్ణహరి పాల్గొన్నారు.

వేల్పూర్‌లో...



పడిగెలలో సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వేల్పూర్ : మండలంలోని పడిగెలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం వరల్డ్ టైలర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దర్జీలను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ మాట్లాడుతూ తమక్లబ్ ద్వారా పేద వర్గాలలోని వృత్తులు చేసుకునే వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణగౌడ్, గ్రామపెద్దలు, మీసాల సురేష్, దయాసిల్ పుణ్యరాజ్, చిన్న సాయన్న, చిన్నారెడ్డి ఉన్నారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన పల్లికొండ శ్రీనివాస్‌కు చెందిన బైక్ గురువారం రాత్రి చోరీకి గురైంది. తన గ్లామర్ బైక్‌ను ఇంటి ఆవరణలో నిలిపి ఉంచగా దొంగలు బైక్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయంపై శుక్రవారం నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని తడగామ కమాన్ సమీపంలో నివాసం ఉంటున్న గొల్ల నాగరాజుకు చెందిన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను సైతం దొంగలు గురువారం రాత్రి ఎత్తుకెళ్లి శివాజీనగర్ కాలనీలో ఉన్న పల్లికొండ శ్రీనివాస్ ఇంటి వద్ద వదిలిపెట్టి అతని బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలో ఇటీవల బైక్ దొంగతనాలు పెరిగిపోయ్యాయని పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్‌ను పకడ్బందిగా నిర్వహించి బైక్ దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

ఏర్గట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రేండ్ల రాజారెడ్డి తల్లి గంగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునిల్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, గడ్డం జీవన్, రేండ్ల రమేష్, మేకల సాయన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు ప్రతిరూపం సైన్స్‌ఫేర్



పొతంగల్‌లో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు



మోస్రా పాఠశాలలో సన్మానిస్తున్న దృశ్యం



నవీపేట శివతండా పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సృజనాత్మకత, మేధాశక్తికి ప్రతిరూపంగా సైన్స్‌ఫేర్ నిలుస్తుందని పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం (సైన్స్‌ఫేర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.సివి రామన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలోచనలు భిన్నంగా ఉంటే ఆవిష్కరణలు సైతం భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. సైన్స్, మ్యాథమెటిక్స్, పర్యావరణ ప్రదర్శనలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సైన్స్ క్విజ్, విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్‌రావు, శంకర్ ఉపాధ్యాయులు బర్ల సాయిలు, నాగనాథ్ పాల్గొన్నారు.

మోస్రా: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా చందూర్, మోస్రా మండలంలోని పాఠశాలలో సామాన్యశాస్త్రం వైజ్ఞానిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలో మోస్రా చింతకుంట, గోవూర్ గ్రామాల్లోని పాఠశాలలో సైన్స్ బోధించే ఉపాధ్యాయులందరికీ తపస్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు గాండ్లమోహన్, ఎంఈవో నాగనాథ్, చందూర్ మండల ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, మోస్రా మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలాజీరావ్, మధుసూదన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్ని : మండల కేంద్రంలోని మ్యాట్రిక్స్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలపై సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, జాతీయ విపత్తుల నివారణ, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, పర్యావరణ పరిరక్షణ, ఆర్గానిక్ వ్యవసాయం పద్ధతులపై సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ప్రాజెక్టు అధికారి గంగా కిషన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయసైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ భారతీయ నోబెల్ బహుమతి పురస్కార గ్రహీత సర్ సీవీరామన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థులు తాము రూపొందిన పలు సైన్స్ చార్టులను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఉపాధ్యాయులు రాజు, మమత, పావని తదితరులున్నారు. ప్రముఖ భారతీయ నోబెల్ బహుమతి పురస్కార గ్రహీత సీవీ రామన్ జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బంది నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. సైన్స్‌కు సంబంధించిన పలు బొమ్మలను ముగ్గుల రూపంలో విద్యార్థులు గీసి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధికారిణి కవిత పాల్గొన్నారు.

ఏర్గట్ల : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలో ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరిపారు. తడపాకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు రవిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, కృష్ణప్రసాద్, నవీన్, రాము లు, స్వప్న, దేవానంద్ గౌడ్‌లు పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎంఈవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ దినోత్సవంలో విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్, పురుషోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటితరం విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాణించాలి

బోధన్‌రూరల్ : నేటితరం విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాణించాలని సైన్స్ అధికారి గంగాకిషన్ అన్నారు. శుక్రవారం నేషనల్ సైన్స్‌డే సందర్భంగా బోధన్ పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబ్, ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సైన్స్ అధికారి గంగాకిషన్ మాట్లాడుతూ ప్రకృతితో మమేకం అవుతూ ప్రశ్నలను సంధిస్తే వచ్చే జవాబులే సైన్స్ అని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలని, దేశానికి సేవలు అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, అకాడమీ ఇన్‌చార్జి సువర్చల, మేనేజర్ చక్రవర్తి పాల్గొన్నారు.

వేల్పూర్ : వేల్పూర్, పచ్చలనడ్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు రాజన్న, రమేష్‌కుమార్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం డ్రాయింగ్, రంగవల్లి వంటి పోటీలు నిర్వహించారు. పచ్చలనడ్కుడ పాఠశాలకు చెందిన గుండెం వాగ్దేవి అనే విద్యార్థి నిజామాబాద్ జిల్లా తరఫున రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ముప్కాల్ : బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో, ప్రభుత్వపాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ఉన్నతపాఠశాలను శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ ఇన్‌సెక్ట్ క్యాచ్‌మెంట్ అనే పరికరం అందరిని ఆకట్టుకుంది. ఈ పరికరం ద్వారా రాత్రి సమయంలో పంట పొలాల్లో క్రిమికి టకాలను ఆకర్షించి పంటలకు రక్షణ కల్పించే విధంగా రూపొందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుజాత, పోషన్న, రాజ్‌కుమార్, వెంకటరమణచారి, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సీహెచ్.సహస్ర, ఎం.శ్రీలక్ష్మీ, విద్యార్థినిలు సహజ ఎరువులను ఉపయోగించి వ్యవసాయ దిగుబడి ఏలా పెంచాలో ప్రదర్శన చేసి వారి ఇద్దరికి జిల్లాస్థాయిలో బహుమతులు సాధిం చాలరని కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

భీమ్‌గల్ : పట్టణ కేంద్రంలో శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు స్వయంగా 50 ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ బసంత్‌రెడ్డి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి బహుమతులు అందజేశారు. అలాగే ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేసి విద్యార్థులకు మెమోంటోలను బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నర్సారెడ్డి, సైన్స్ ఇన్‌చార్జీ స్వప్న, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, వినోద్‌కుమార్, హరిక, నవనీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వర్నిలో సైన్స్ దినోత్సవం..



ఏర్గట్ల మండలం తడపాకల్‌లో...



డొంకేశ్వర్‌లో తిలకిస్తున్న ఎంఈవో, ఎంపీడీవో



ఆర్మూర్‌లో విద్యార్థులు తయారు చేసిన సోలార్ పరికరం

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని సినీ నటుడు మానం కోటేశ్వర్ రావు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సామ నర్సారెడ్డిలు అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని సాయి ప్రసన్న పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక, అన్ని రంగాలలో రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయప్రకాష్‌లతో ఉపాధ్యాయ బృందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వీ.దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్‌లోని ఉషోదయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉషోదయ మహిళా జూనియర్ కళాశాల 28వ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు గురువుల పట్ల వినయ, విధేయతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదివి తమ ఉన్నత లక్ష్యాలను చేరుకుని, తల్లిదండ్రులతో పాటు కళాశాలకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవ్వకుండా ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సముద్రాల నర్సింహ చారి, కళాశాల కరస్పాండెంట్ సూర్యప్రకాష్, డైరెక్టర్లు దృశ్యాంత్, రమణి, సునీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- **సాంస్కృతిక కార్యక్రమాలు**

కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ వేషధారణలతో సాంస్కృతి కార్యక్రమాలు చేయడంతో సందడి నెలకొంది. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్యాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రావణ్‌గార్డెన్‌లో శుక్రవారం స్మైల్ ద స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు పాఠశాల డైరెక్టర్ రఫీయొద్దిన్‌గోహెర్ తెలిపారు. ఈ సంద ర్భంగా టీవీ సీరియల్ నటిమణులు పద్మావతి, దివ్యలు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలని, తల్లిదండ్రులు చదువుపై పిల్లలకు ఒత్తిడి తీసుకురావద్దని అన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షబాన గోహెర్, ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మీ, సవిత, సింధుర, శ్రావణి, సింధుజ, రోజా, సవిత, స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

భీమ్‌గల్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో రానున్న వేసవికాలం దృష్ట్యా పట్టణంలో ఎక్కడ కూడా నీరు సమస్య లేకుండా చూడాలని ఏఈ, వాటర్‌మెన్‌లను కమిషనర్ ఆదేశించారు. లీకేజీలు ఏర్పడిన వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పలు మంచినీట వాటర్‌ట్యాంకులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతును పరిశీలిస్తున్న కమిషనర్

ఎంపీడీవోల జిల్లా కార్యవర్గం

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోల జిల్లా ఎన్నికలను శుక్రవారం జిల్లా డీఆర్‌డీవో కార్యాలయంలో జిల్లాలోని ఎంపీడీవోలు సమావేశం ఏర్పాటు చేసి జడ్పీసీఈవో సాయాగౌడ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా రాంనారాయణ, ఉపాధ్యక్షులుగా నీలవతి, రాములునాయక్, జాయింట్ సెక్రెటరీగా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నాగనాథ్, పబ్లిసిటి సెక్రెటరీగా సతీష్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు బాలకిషన్, శంకర్, తిరుమల, రాజ, శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఎన్నికైన ఎంపీడీవోల జిల్లా కార్యవర్గ సభ్యులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మండల ప్రత్యేక అధికారి ప్రవీన్ సూచించారు. శుక్రవారం మండలంలోని అర్గుల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రిఫైనల్ పరీక్షలను తరగతి గదులకు వెళ్ళి పరిశీలించారు. విద్యార్థులు బాగా చదివి ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. ఆయన వెంట గ్రామ ప్రత్యేక అధికారిణి, వ్యవసాయాధికారిణి దేవిక, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ప్రవీన్

బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మహేష్

భీమ్‌గల్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ బస్టాండ్‌లో పండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌ను ఇబ్బందులు కలిగించవద్దని ఎస్సై మహేష్ సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని అంగడిబజార్‌లో కమిటీ భవనంలో పండ్ల వ్యాపారులతో సమావేశమయ్యారు. బస్టాండ్ ప్రాంతంలో పండ్ల వ్యాపారులు వచ్చి పోయే బస్సులకు ప్రజలకు అంతరాయం కలిగిస్తున్నారని, పండ్ల దుకాణాల్లో ఎక్కడ పడితే అక్కడ పెట్టకూడదని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, పండ్ల వ్యాపారులు ఉన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన



యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలం పురాణిపేట్ గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తడిపొడి సాగుపై అవగాహన కల్పించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలేటర్ నోముల మహేందర్ మాట్లాడుతూ వరిలో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులు అమలు చేసుకోవాలని, వరిలో కలుపు ను తొలగించి తర్వాత పొట్ట దశ వచ్చే సమ యం వరకు ఎక్కువ నీరు అవసరం ఉందని, కేవలం 45 తడులతో తడిపొడి విధానం పాటించి సాగు చేయవచ్చునని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది, గ్రామ రైతులు సుంకరి గంగయ్య, ధైడి సురేష్, హెచ్. ప్రశాంత్, శ్రీరాంసాగర్, గోపాల్, రమేష్, బాలరాజు, కస్తూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం

● రాములు, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, నిజాంసాగర్



సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారంతో పాటు భోజనాన్ని కూడా అందిస్తున్నాం. వారానికి ఐదు రోజుల పాటు ఒక్కొక్క గుడ్డు, అరటి పండును అందజేస్తున్నాం. పదో తరగతిలో విద్యాభ్యాసం చేస్తున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని సాంఘిక సంక్షేమ వసతి గృహం అచ్చంపేట వెల్ఫేర్ ఆఫీసర్ రాములు 'ఆంధ్రజ్యోతి'తో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : మీ అచ్చంపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఎంత మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తూ ఉన్నారు? ఏఏ తరగతిలో ఉన్నారు?

వెల్ఫేర్ ఆఫీసర్: మా అచ్చంపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తూ ఉంటారు. కాని వసతి గృహంలో ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగుతుంది. హాస్టల్‌లో 107 మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : మీ హాస్టల్‌లో 10వ తరగతిలో పదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

వెల్ఫేర్ ఆఫీసర్: మా అచ్చంపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పదో తరగతిలో 27మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి ఉదయం సాయంత్రం సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ఒక్కొక్కరికి ఎంత మెనూ కేటాయించారు?

వెల్ఫేర్ ఆఫీసర్: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు మూడవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు 1330, 8వ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1540 రూపాయల చొప్పున మెనూ కేటాయించారు. అదే విధంగా కాస్మోటిక్ చార్జీలు ఏడవ తరగతి వరకు 150 రూపాయలు పదవ తరగతి వరకు 200 రూపాయలు చెల్లిస్తుంది.

ఆంధ్రజ్యోతి : సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యార్థులకు అల్పాహారంతో పాటు భోజనాన్ని ఎలా అందిస్తున్నారు?

వెల్ఫేర్ ఆఫీసర్: సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాల్లో సోమ, మంగళ వారాలలో ఉదయం పూట ఉప్మా, అటుకులు బుధవారం, ఆదివారం చికెన్ వారానికి ఐదు రోజులు గుడ్డు, అరటి పండు ప్రతిరోజు సాయంత్రం వేళ అల్పాహారం అందిస్తాం.

ఆంధ్రజ్యోతి : సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులు చేసే విద్యార్థులకు దుస్తుల, పాఠ్య పుస్తకాలు నోట్ బుక్‌లు దుప్పట్లు అందించారా?

వెల్ఫేర్ ఆఫీసర్: సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు నాలుగు జతల బట్టలతో పాటు పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాం. హాస్టల్‌లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు చలికి దుప్పట్లు కూడా అందించాం.

● (ఆంధ్రజ్యోతి, నిజాంసాగర్)

కలగా మిగిలిన చేపల మార్కెట్

● నాడు మాజీ మంత్రి చేతుల మీదుగా ఘనంగా శంకుస్థాపన ● ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోని పనులు ● మత్స్య కార్మికుల వ్యాపారానికి అందని సేవలు

ఆంధ్రజ్యోతి పరిశీలన



చేపల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నాటి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్(ఫైల్)



నిర్మించే ప్రదేశం



చేపలు విక్రయించే స్టాల్



మంత్రి ప్రారంభించిన శిలాఫలకం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.50 లక్షలతో (నీలి విప్లవం స్కీం) చేపల మార్కెట్ నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా 2023 సెప్టెంబరు 14న ఘనంగా శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనుల ఊసే లేకపోవడంతో శిలాఫలకం వెక్కిరిస్తుంది. రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా శంకుస్థాపన చేశారు. దీని కోసం చెరువుకట్టపై ఖాళీ ప్రదేశాన్ని చదును చేయించారు. నిర్మాణ పనులు ప్రారంభం కాకముందే చేపల విక్రయం స్టాల్‌ను తీసుకొచ్చి అక్కడ ఏర్పాటు చేశారు. కానీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభకాకపోవడంతో మత్స్యకార్మికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. చేపల విక్రయం రోడ్డు పక్కన జరగడమే అదే తంతువుగా మారింది. మత్స్యకార్మికులకు కనీస వసతులు లేక డిచ్‌పల్లి మార్కెట్‌లో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మూత్రశాలలు, తాగునీరు వంటి వసతులు ఏమి లేవు. దీంతో దూర ప్రాంతాల నుంచే వ్యాపారులకు, మత్స్యకార్మికులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రతీ ఆదివారం డిచ్‌పల్లిలో చేపల విక్రయాలు అధికంగా జరుగుతుంటాయి. నిజామాబాద్, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, మోపాల్ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, ఈ మార్కెట్‌కు వస్తుంటారు. బుధవారం వారంతపు సంత తో ఈ చేపల మార్కెట్ రద్దీగా ఉంటుంది. వసతులు లేక వ్యాపారస్థులు, వినియోగ దారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం వచ్చి ఏడాదిన్నర గడిచిన ఈ పనులు ప్రారంభం కావడం లేదు. ఈవిషయంలో స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి గతంలో రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల కార్యక్రమ సభలో మాట్లాడుతూ.. డిచ్‌పల్లి కేంద్రంలో మంజూరైన చేపల మార్కెట్‌కు తాను ఫిషరిస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి సీఎంని కలుస్తామని డిచ్‌పల్లి చేపల మార్కెట్‌కు మరో 50లక్షల రూపాయలు అదనంగా మంజూరు చేయించి కోటి రూపాయలతో అతిపెద్ద చేపల మార్కెట్ నిర్మిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎటు వంటి కదలికరాలేదని మత్స్య కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, మత్స్యకార్మికులకు, వ్యాపారస్థులకు న్యాయం చేయాలని, చేపల మార్కెట్ నిర్మాణ పనులు ప్రా రంభించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

● సారంగాపూర్ ఒడ్డెర కాలనీ వాసుల ఆవేదన ● ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న సారంగాపూర్ గ్రామస్థులు

మోపాల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా సంబంధిత కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని సారంగాపూర్ ఒడ్డెరకాలనీ వాసులు ఖాళీ బిందెలతో రోడ్డుపై శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో గత కొన్ని రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు చెప్పిన కూడా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు మండిపడ్డారు. సారంగాపూర్ గ్రామాన్ని కార్పొరేషన్‌లోకి విలీనం చేయడం వల్ల గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో గ్రామాన్ని విలీనం కానప్పుడు ఏ సమస్య ఉన్నా గ్రామపంచాయతీలోనే సమస్యను పరిష్కరించుకునేవారిమని ఇప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారని గ్రామస్థులు మండిపడ్డారు. ఇంకా ఎండలు ముదరకముందే ఇప్పుడే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వచ్చే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని అప్పుడు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో కార్పొరేషన్ అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవని వారు వాపోయారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలో అర్థం కాని స్థితిలో ఉన్నామని ప్రతీ సమస్యను నగరానికి వచ్చి అధికారులకు చెప్పాలంటే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా తాము ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఖాళీ బిందెలతో కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించాల్సిన పరిస్థితి వస్తుందని కాలనీ మహిళలు హెచ్చరించారు.

జాతరకు మోతె రాజరాజేశ్వరస్వామి ముస్తాబు

● గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నేడు జాతర



ప్రతిష్ఠించిన శివ పార్వతులు, గణపతి



జాతరకు ముస్తాబైన మోతె రాజరాజేశ్వరస్వామి ఆలయం



మోతె రాజరాజేశ్వరస్వామి ద్వారం

వేల్పూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల అనంతరం ప్రతీయేటా ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగే వేల్పూర్ మండలం మోతె గ్రామ రాజరాజేశ్వరస్వామి ఆలయం అన్ని హంగులతో ముస్తాబైంది. వేల్పూర్, భీమ్‌గల్, మోర్తాడ్ మండలాల సరిహద్దులో గల మోతె గ్రామశివారున గుట్ట ప్రాంతంలో శనివారం జరిగే జాతర ఉత్సవాలకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆర్మూర్ సబ్ డివిజన్ గ్రామాల రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఓ ప్రత్యేకత. వేములవాడ జాతర జరిగిన మూడు రోజులకు ఇక్కడ ప్రతీ యేటా జాతర జరగడం ఆనవాయితీగా వస్తుంది. గుట్ట వద్ద ఉన్న ఆలయంలోని గర్భ గుడిలో శివ లింగం, ఆలయానికి ఇరుపక్కల నాగదేవత, గణపతి, శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించి అత్యంత ప్రవిత్రతను సంచరించుకుంది. సుమారు 75 ఏళ్ల క్రితం మోతె గ్రామస్థులు శివరాత్రి వేములవాడ జాతరకు కాలినకడన వెళ్లి తిరిగి మూడు రోజులకు గ్రామానికి చేరుకునే వారిక ఇక్కడ జాతర నిర్వహించేవాడని వృద్ధులు తెలిపారు. అనాటి నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతూ వస్తుందని వారు తెలిపారు. జాతర రోజైన మార్చి 1న ఉదయం గ్రామంలోని ఆలయం నుంచి రాజరాజ్వేరస్వామి విగ్రహం పల్లకిపై ఊరేగింపు నిర్వహిస్తూ జాతర జరిగే గుట్ట వద్ద ఆలయానికి తీసుకువెళ్లి రథంపై గుడిచుట్టు తిప్పుతారు. ఆ రోజు రాత్రి అక్కడి ఆలయంలో రాజరాజేశ్వరుడు నిద్రపోయి తిరిగి 2వ తేదీన మోతె గ్రామ ఆలయంలోకి చేరకుంటుందని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రుద్రాభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం, శివ పంచాక్షరి జపం, యజ్ఞం హోమం జరుగుతాయని వారు తెలిపారు. జాతర రోజు బ్రహ్మనోత్తములచే మహా న్యస పూర్వకంగా పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. మొక్కుకున్న వారు స్వామి వారి ఆలయం చుట్టూ కొడె దూడలను తిప్పుతూ మొక్కులు తీర్చు కోవడం ఈ జాతరకు ప్రత్యేకత. ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని వి విధ మండలాల గ్రామాలతో పాటు మహా రాష్ట్రలోని నాందేడ్, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రాజరాజేశ్వర స్వామికి మొక్కులు తీర్చుకుంటారు.

నిత్య జీవితంలో సైన్స్ చాలా ముఖ్యమైనది

● నిజామాబాద్ డీఈవో అశోక్



విద్యార్థినుల సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈవో అశోక్



సాంఘిక సంక్షేమ పాఠశాలలో సైన్స్ దినోత్సవం దృశ్యం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో సైన్స్ చాలా ముఖ్యమైనదని విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృ క్పధాన్ని అలవర్చుకున్నప్పుడే సైన్స్‌లో ఉన్నత శిఖరాన్ని అధిరోహించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శుక్రవారం స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ స్వచ్ఛంద సంస్థ దివ్యాంగుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైన్స్ ప్రదర్శనను తిలకించి మాట్లాడారు. మన నిత్య జీవితంలో ప్రతీ నిమిషం గడవడం అంటే కేవలం సైన్స్‌తో ముడిపడి ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల పరిశోధనలు చేసినప్పుడే వారి మెదడులో శాస్త్రీయ దృక్పధం అలవాటు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా బాధ్యుడు నర్రా రామారావు, సౌందర్య, విజయానంద్‌రావు, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ పాఠశాలలో..

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ విజయలలిత పూలమాలలు వేసి దీపారాధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రవేత్తలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంతో ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు జరుపుకోవడం అభినందనీయమన్నారు. సైన్స్ గొప్పతనాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ తమ ఉపన్యాసాలు ద్వారా కొనియాడారు. నిజజీవితంలో సైన్స్ అంశాన్ని విద్యార్థులు నృత్య ప్రదర్శనల ద్వారా ఆరాధించారు. ఈ నెల 25వ తేదీన సైన్స్ దినోత్సవం సందర్భంగా సృజనాత్మకత పోటీలను పాఠశాల ప్రాంగణంలో నిర్వహించడం జరిగిందని ఇందులో 10వ తరగతి విద్యార్థిని ఎం.శ్రద్ధ ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ అంశంపై పోస్టర్ మేకింగ్‌లో ప్రథమ స్థాయిలో ఎంపికై 3వేల నగదు బహుమతిని అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని అభినందించారు. ఈ వేడుకల్లో సిబ్బంది వినోద, రాజేశ్వరి, రజిని, సుమలత, వాణి, సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

● సీఎస్‌డీవోల సమావేశంలో డీఐఈవో రవికుమార్





సమావేశానికి హాజరైన సీఎస్‌డీవోలు, మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని డీఐఈవో రవికుమార్ అన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు సంబంధించి శుక్రవారం ఖిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమీషనర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రతీ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మంచినీటి వసతి, మరుగుదొడ్లు, వైద్య సదుపాయ సేవల కోసం ప్రాథమిక ఆరోగ్య సేవలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తమ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నా పత్రాల బండళ్లను పోలీసు బందోబస్తుతో తీసుకెళ్లిన తర్వాత పరీక్ష కేంద్రంలో ఖచ్చితంగా సీసీ కెమెరాల ముందు మాత్రమే ప్రశ్నపత్రాలను తెరవాలని ఆయన అన్నారు. పరీక్ష కేంద్రంలో కేటాయించిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మంచి ఫర్నిచర్‌ను సమకూర్చుకోవాలని అలాగే ప్రతీ పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లను నియమించి వారికి శిక్షణ ఇచ్చే బాధ్యత సీఎస్‌డీవోలదేనన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా కేంద్రంలోని పరీక్షల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పనిచేస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే సమీపంలోని పోస్టాఫీసులో జవాబు పత్రాల బండళ్లను నిక్షిప్తం చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్ కానీ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఎవరూ తీసుకురాకుండా చూసే బాధ్యత సీఎస్‌డీవోలదేనన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన సిబ్బంది, ఉద్యోగులపై ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందని మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా విద్యార్థులను పరీక్ష కేంద్రం బయటే తనిఖీలు చేసి పంపాలన్నారు. పరీక్షలు 9 గంటలకు ప్రారంభం కానుండగా ఉదయం 8.15ల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టవల్సిన చర్యలపై సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో చిన్నయ్య, రజీయుద్దీన్, కనక మహాలక్ష్మి, బుద్ధిరాజ్ పాల్గొన్నారు.

డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో అనుమతి

ఇంటర్ బోర్డు విద్యార్థుల హాల్‌టికెట్లను ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేయడం జరిగిందని ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాల్ టికెట్లు ఇవ్వకపోయిన విద్యార్థులు ఇంటర్నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లతో పరీక్షలకు హాజరుకావచ్చని డీఐఈవో తెలిపారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా వెంటనే హాల్‌టికెట్లను అందరికి ఇవ్వాలని ప్రైవేటు కళాశాలలను ఆదేశించారు. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం, స్టాంప్ లేకున్నా పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఆయన సీఎస్‌డీవోలను కోరారు.

పరీక్షలకు హాజరుకానున్న 36వేల 222 మంది విద్యార్థులు...

ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు జిల్లాలో మొత్తం 36వేల 222 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 15వేల 53 మంది కాగా, వొకేషనల్ విద్యార్థులు 2వేల 736 మంది, మొత్తం 17వేల 789 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ రెగ్యూలర్ విద్యార్థులు 13వేల 944 మంది, ప్రైవేటు (సప్లిమెంటరీ) 2వేల 128 మంది, వొకేషనల్ ద్వితీయ సంవత్సరం రెగ్యూలర్ విద్యార్థులు 2వేల 42 మంది, ప్రైవేటు విద్యార్థులు 319 మంది హాజరుకానున్నారు.

కార్మిక సంఘాల మహాసభకు తరలిరావాలి

ఇందల్వాయి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి 5వ తేదీన బోధన్ టీటీడీ కల్యాణ మండపంలో జరిగే జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘాల మహాసభకు భవన నిర్మాణ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు చెల్లా శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇందల్వాయి మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మహాసభ పోస్టర్ల ఆవిష్కరించారు.

31లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై 25 శాతం రిబేట్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- కొత్త దరఖాస్తులకు అవకాశం
- అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో సహాయక కేంద్రాలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220183

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ఈనెల 31 దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం 25శాతం రిబేట్ సౌకర్యాన్ని వర్తింపజేస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వెల్లడించారు. నాన్‌లేఅవుట్ ప్లాట్లు కలిగి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సాయంత్రం ఎల్‌ఆర్‌ఎస్ అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నాన్‌లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిబేట్ సౌకర్యం కల్పించినందున ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ అర్హులైనవారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 2020 ఆగస్టు 26 లోపు దాఖలైన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మాత్రమే ఇదివరకు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించగా ప్రస్తుతం ఆ గడువును ప్రభుత్వం ఎత్తివేస్తూ కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించిందని కలెక్టర్ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకునేవారికి తగిన సమాచారం తెలియజేస్తూ వారి సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. అలాగే సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయం కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ నెంబర్ 08462-220183కు కార్యాలయాల పనివేళలో సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్లు, ప్లాట్ అప్లికేషన్ సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి, ఇరిగేషన్ ల్యాండ్ వంటి అంశాలను పక్కాగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారులకు అనవసర ఇబ్బందులకు గురిచేయవద్దని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తేవారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా ఇది ప్రైవేటు స్థలమేనా లేక ప్రభుత్వ స్థలమా అన్నది అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా నిర్ధారించుకోవాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ప్రగతి కనిపించేలా అంకితభావంతో పనిచేయాలని వారం రోజుల అనంతరం మళ్లీ సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతే, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, సంబంధిత అధికారులున్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వైద్యులు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

మాక్లూర్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రజలకు వెల్లవేళలా అందుబాటులో ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. మండలకేంద్రంలోని మాక్లూర్ ప్రా థమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్యసదుపాయాలను పరిశీలిస్తూ స్థానికంగా నిర్వహిస్తున్న రక్తపరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగితెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి ఆసుపత్రి నిర్వహణ తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నాయా, రక్తపోటు, డయేబెటిక్ పరీక్షలు ఎంతమందికి పరీక్షలు చేస్తున్నారని ఆరా తీశారు. డయేబెటిక్ కిట్లు అందుబాటులో ఉన్నాయా, వ్యాక్సినేషన్ రూంను సందర్శించి శీతలికరణ ఉంచిన రూంలను పరిశీలిం చారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఏలియా తండాలో గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలిస్తూ కొత్తబియ్యం కేటాయించడంతో మెత్తగా అవుతోందని నిర్వాహకులు తెలుపగా గురుకులానికి కేటాయించిన బియ్యం నాణ్యతను తనిఖీ చేస్తూ సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి నాణ్యమైన సన్నబియ్యం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ పద్మలత, గురుకుల పాఠశాల ఇన్‌చార్జీ విద్యరాణి వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

(5వ పేజీ తరువాయి)

కూడా ఎక్కువ మొత్తంలో ఓట్లను తీసుకోవడం ద్వారా ముగ్గురు ప్రధాన అభ్యర్థులు కూడా రెండో ప్రాధాన్యత ఓట్లపైనే ఆశతో ఉన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పోల్ అయిన ఓట్లలో 50 శాతంగా పైగా ఓట్లు అభ్యర్థికి రావాలి. త్రిముఖ పోటీ ఉండటంతో అది సాధ్యమయ్యే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు. రెండో ప్రాధాన్యత ఓట్లపైనే ముగ్గురు అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. పోల్ అయిన ఓట్లు ఎక్కువగా ఉండటం ఏ అభ్యర్థికి అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో వన్‌సైడ్‌లో పడకపోవడం వల్ల అభ్యర్థుల్లో కొంత నిరాశ నెలకొనగా పోటీ ఎక్కువగా ఉండటం వల్ల రెండో ప్రాధాన్యత ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ద్వారానే ఈ దఫా టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కూడా భారీగా పెరిగింది. ప్రధానంగా ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి మధ్యనే పోటీ ఎక్కువగా కనిపించింది. పోలింగ్ కూడా వారిద్దరికి ఎక్కువగా ఓటర్లు మద్దతు పలకడంతో గెలుపు ఓటములపై అంచనాకు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు కూడా భారీగా ఖర్చు చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే వీరి ఖర్చు తక్కువే అయినా గత ఎన్నికలతో పోలిస్తే మాత్రం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేశారు. వీరిద్దరు కూడా మొదటి ప్రాధాన్యత ఓట్లపైనే ధీమాతో ఉన్నారు. ఇద్దరు తమకు 50 శాతానికి పైగా ఓట్లు వస్తాయని అంచనాకు వస్తున్నారు. ఒకవేళ తగ్గితే రెండో ప్రాధాన్యత ఓట్లతో బయటపడతామని అంచనా వేస్తున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో జరిగిన పోలింగ్ సరళిని అంచనా వేస్తూ ఎవరికి వారే గెలుపుపై ధీమాతో ఉన్నారు. తమ టీమ్‌ల ద్వారా పోలింగ్ కేంద్రాల్లో పడిన ఓట్లపై అంచనాకు వస్తూనే కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాల సమాచారాన్ని కూడా తీసుకుంటూ గెలుపుపై అంచనా వేస్తున్నారు. ఈఎన్నికల్లో రెండో నిఘా సంస్థలు పోలింగ్ సరళిని అంచనా వేయడంతో పాటు తమ ఉన్నతాధికారులకు గెలుపు ఓటములపై నివేదికలను పంపించారు. ఇవే కాకుండా కొంత మంది అభ్యర్థులు ప్రత్యేక ఏజెన్సీల ద్వారా కూడా పోలింగ్ సరళిపై అంచనా వేశారు. వీటి ద్వారా గెలుపు ఓటములపైన అంచనాకు వస్తూ తమ దగ్గరివారితో చర్చిస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ మార్చి 3న కరీంనగర్‌లో జరుగనుండటంతో ముందస్తుగా ఒక అంచనాకు అభ్యర్థులు వస్తున్నారు. అన్ని జిల్లాల పరిధిలోని వివిధ సంస్థలకు చెందిన వారి ద్వారా ఈ అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా రెండో ప్రాధాన్యత ఓట్లే కీలకంగా మారే అవకాశం ఉందని ఆయా పార్టీల నేతలు తెలిపారు.

సాగునీరు అందక ఎండుతున్న వరి

(5వ పేజీ తరువాయి)

ఆధారపడదామంటే భూగర్భ జలాలు అడుగంటి నీటి సరఫరా తగ్గిందన్నారు. కళ్లెదుటే పంటలు ఎండిపోతుంటే అధికారులు పట్టించుకోకపోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టుకు నీటిని సరిపడా అందించి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు రాంబాబు, వాసు, లక్ష్మణ్‌రావు, బర్ల రవి, అచ్యుత్‌రావు, సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు.

అధికారులను నిర్బంధించిన రైతులు

(5వ పేజీ తరువాయి)

పరిశీలించాలని కోరారు. పంటపొలాలకు ప్రస్తుతం సాగునీరు చాలా అవసరమని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పంటలను పరిశీలించేందుకు వచ్చిన అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని, తమ సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీలో నిర్బంధించారు. ఇరిగేషన్‌శాఖ డీఈ భూమన్న, సీనియర్ ఇంజనీర్లు శ్రుతి, సత్యనారాయణలను గ్రామ పంచాయతీలో కూర్చొబెట్టి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఉన్నతాధికారులు, పోలీసులు సాలూర క్యాంప్ గ్రామానికి చేరుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి అధికారులను గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిజాంసాగర్ కాలువ నీటిని పంటలకు సరైన సమయంలో అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ పంటలకు నిజాంసాగర్ నీళ్ల అందించకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. నిజాంసాగర్ కాలువ నీరు కొన్ని రోజులు చివరి ఆయకట్టు వరకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఈఈ బలరాం మాట్లాడుతూ చివరిఆయకట్టు వరకు నీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిజాంసాగర్ నీటి ప్రవాహం పెరిగేలా చూసి కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందిస్తామని హామీఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

- ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాలువలను పరిశీలించిన అధికారులు

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ఇరిగేషన్ ఉన్నతాధికారులు బోధన్, సాలూర మండలానికి వచ్చే సాగునీటి కాలువ డీ28ను మెయిన్ కాలువలను, తూములను పరిశీలించారు. చివరి ఆయకట్టు రైతులు సాలూర క్యాంప్, కుమ్మన్‌పల్లి, జాడిజమాల్‌పూర్, నాగన్‌పల్లి గ్రామాల రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతుల పంటలు ఎండకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సాలూరలో నీటిప్రవాహం పెంచి నీటిని అందిస్తామని ఇరిగేషన్ అధికారులు స్పష్టమైన హామీతో రైతులతో భరోసా కల్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఇరిగేషన్‌శాఖ సీఈ మధుసూదన్, ఈఈ బలరాం, డీఈ లోక్యానాయక్, ఏఈ శ్రీనివాస్, బాన్సువాడ డీఈ భూమన్న, జేఈ శృతి, సత్యనారాయణలతో సాలూర, మందర్నా సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, మందర్నా రవిలతో ఆయా గ్రామాల రైతులు తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు ప్రారంభం కావడానికి ముందే కేంద్రాలను సందర్శించి తాగునీటి వసతి, సరిపడా ఫర్నీచర్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించాలని తసీల్దార్లకు సూచించారు. పరీక్షసమయానికి అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు చేరాలని, పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసివేసి 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వార్షిక పరీక్షలకు సంబంధించి వారికి ఏమైనా సమస్యలు సందేహాలు ఉంటే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసు కోవాలని డీఐఈవోను ఆదేశించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఐఈవో రవికుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్ రమేష్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, డీపీవో శ్రీనివాస్, డీఈవో అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో సీవీ రామన్ జయంతి వేడుకలు



సీవీ రామన్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రముఖ శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ శాస్త్ర విజానాన్ని ఉపయోగించుకోవాల్సింది మానవ కల్యానానికి గానీ మారణహోమానికి కాదని సీవీ రామన్ తెలిపారని పేర్కొన్నా రు. శాస్త్రీయ పరిశోధన నిర్వహించి సమాజానికి దిక్సూచిగా పనిచేయలన్నారు. కార్యక్రమానికి సీవోఈ సంపత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఆర్వో పున్నయ్య, డీన్ ఆరతి, డా.నాగరాజు, డా.ప్రసన్న, డా.నీలిమా పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్ప ఆలయంలో బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో శ్రీశ్రీశ్రీ బీరప్ప కల్యాణ మహోత్సవాలు వైభోపేతంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మార్చి 1న మహిళా బోనాలు, 2న గంగా బోనాలు లింగల వెతుకు లాట, 3న బీరప్ప కామరతి కల్యాణో త్సవం, 4న ఎల్లమ్మ చరిత్ర, 5న నాగవెల్లి బోనాలు, 6న కమారతి నాగవెల్లి కథ కార్యక్రమాలు జరుగుతాయని కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి హాజరువుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అటవీ సంపదను రక్షించాల్సిన బాధ్యత అందరిది

- ఫారెస్టు రేంజ్ అధికారి రవిమోహన్

ఇందల్వాయి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని ఫారెస్టు రేంజ్ అధికారి రవిమోహన్ భట్ అన్నారు. శుక్రవారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో అడవుల పరిరక్షణ, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అటవీ సంపదను కొందరు కాల్చివేస్తున్నారని అది ఏమాత్రం మంచిదికాదన్నారు. వన్యప్రాణులను కాపాడుకోవాలని అగ్ని ప్రమాదాల బారిన పడకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా అటవీ సంపదను ఎవరైనా కాల్చినట్లయితే వన్యప్రాణులను వేటాడినట్లయితే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అడవులను సంరక్షించే బాధ్యత ప్రతీ పౌరుడు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, నవీన్‌గౌడ్, వీడీసీ అధ్యక్షుడు జితేందర్, అగ్నిమాపక సిబ్బంది, వివిధ గ్రామాల కార్యదర్శులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి వీడ్కోలు

ఖిల్లా, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో విధులు నిర్వహించి శుక్రవారం పదవీ విరమణ చేసిన సిబ్బందికి అదనపు డీసీపీ బస్వారెడ్డి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించడం గొప్ప విషయమని డీసీపీ అన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించడం కత్తిమీద సాములాంటిదని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లు ఎదురవుతాయన్నారు. పదవీ విరమణ చేసిన వారు తమ మిగతా జీవితాన్ని కుటుంబసభ్యులతో సంతోషంగా గడుపాలన్నారు. పదవీ విరమణ చేసినవారిలో నిజామాబాద్ రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన యేముల వెంకయ్య, రుద్రూర్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేసి పదవి విరమణ చేస్తున్న కోట విఠల్‌లు ఉన్నారు. వీరు విధుల్లో ఎటువంటి రిమార్క్ లేకుండా పని చేసి పోలీసు శాఖ ద్వారా ఎన్నో పతకాలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాస్‌రావ్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సతీష్‌కే.శ్రీనివాస్, తిరుపతి, పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్ శంకర్, పోలీసు సంక్షేమ శాఖ జిల్లా అధ్యక్షుడు షకీల్ పాషా, సిబ్బంది కుటుంబ సభ్యులు ఉన్నారు.

ధీర్ఘకాలిక ఋణాలపై ఓటీఎస్ గడువు ఈనెల 31 వరకు పెంపు

- డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని సహకార సంఘాల్లో ధీర్ఘకాలిక ఋణాలు తీసుకున్న వారి కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ గడువును పెంచినట్లు బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. ఆయన బ్యాంక్ ఆవరణలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ ధీర్ఘకాలిక ఋణాల చెల్లింపు కోసం ఇచ్చిన ఏకకాల గడువు ముగిసిన ఈనెల 31 వరకు పెంచినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని సొసైటీల పరిధిలో ఇంకా రూ.115 కోట్ల ధీర్ఘకాలిక ఋణాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ ఋణాలు తీసుకున్న వారి కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో భాగంగా వడ్డీలో 40 శాతం, అపరాధ వడ్డీలో 100 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అన్నిసొసైటీల పరిధిలో ఋణాలు తీసుకున్నవారు ఉపయోగించుకోవాలని కోరారు. నాన్‌ఫామ్ సెక్టర్, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ గ్రూప్‌లు, మార్టిగేజ్ ద్వారా ఋణాలు తీసుకున్న వారికి కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా కేంద్ర సహకార బ్యాంకును సంప్రదించాలని కోరారు.

ధర్పల్లిలో ఘనంగా సైన్స్ దినోత్సవం

ధర్పల్లి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ధర్పల్లిలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల లిటిల్ హార్ట్స్ పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సైన్స్ సంబంధించిన అంశాలతో కూడిన ప్రాజెక్టు వర్క్, ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను, ప్రదర్శనలు అధ్యాపక బృందం పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం అల్లాడి సాధన, డైరెక్టర్ ప్రశాంత్‌గౌడ్, ఉపాధ్యాయలు, తదితరులు ఉన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత చాలా అవసరం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక అక్షరాస్యత చాలా అవసరం అని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పొదుపు చేసే మహిళ సాధిస్తుంది ఘనత అనే అంశంపై లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు డబ్బులను పొదుపు చేసుకోవడానికి బడ్జెట్‌ను పెంపొందించుకోవాలని అనవసర ఖర్చులను తగ్గించి వ్యాపార లావాదేవీల ద్వారా లాభాలు ఆర్జించడమే కాకుండా ఆర్థికపరమైన నిర్వాహణ అంశాల గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. శుక్రవారం డీఈవో అశోక్‌కు కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నారాయణ, శ్రీచైతన్య, ఆల్ఫోర్స్ ఇతర కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా విద్యార్థులను, తల్లిదండ్రులను మభ్యపెడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లను చేస్తున్నారని ఆయన అన్నారు. ఫీజు రాయితీల పేరుతో పీఆర్‌వోలను, నిరుద్యోగ యువతను పెట్టుకొని అమాయకపు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు వాటిని నివారించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దుచేసి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, శివాజీ, సుబోద్, తదితరులు ఉన్నారు.

లొంక రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న అదనపు డీసీపీ

సిరికొండ, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): శ్రీ లొంకరామలింగేశ్వర స్వామిని నిజామాబాద్ అదనపు డీసీపీ బస్వారెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు అదనపు డీసీపీకి స్వాగతించారు. అదనపు డీసీపీ వెంట ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై ఎల్.రామ్ ఉన్నారు.

మేరు కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మేరు కులస్థుల సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించి పరిష్కారానికి కృషిచేస్తానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల మేరు సంఘం భవనంలో శుక్రవారం టైలర్స్‌డే సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేలా విశ్వకర్మ యోజన పథకం తెచ్చిందని అన్నారు. ఈ పథకం ద్వారా కులవృత్తులు చేసేవారికి చేయూతగా పని నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉపకార వేతనం, పని ముట్లు పరికరాలకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.2లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. టైలర్స్ పని చేసే మేరు కులస్తులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని వారి న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీలో ప్రశ్నిస్తానన్నారు. కుల వృత్తి చేసుకునే వారికి ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా ఐదు కుట్టు మిషన్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాకిషన్, సోమ హన్మంత్‌రావు, దశరథం, గడుగు రోహిత్, ఎర్రం సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో ఘనంగా టైలర్స్‌డే

ధర్పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్‌లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరించిన వస్త్రం వ్యక్తి హుందాతనాన్ని తెలుపుతుందని ఎంత ఖరీదైనా వస్త్రమైన అది అందమైన డ్రెస్‌గా మారిందంటే అది టైలర్ పుణ్యమేనని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఎంతో మంది నిరుద్యోగులకు, గృహిణిలకు ఉపాధి కల్పించే వృత్తి టైలరింగ్ అని పేర్కొన్నారు. దర్జీలందరికీ ప్రపంచ టైలర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎల్‌వీ లింబాద్రి, సబ్బని గంగాధర్, దాసరి గంగాధర్ పాల్గొన్నారు.

- మేరు సంఘం ఆధ్వర్యంలో..

ధర్పల్లి మేరు సంఘం భవనంలో మేరు సంఘం ఆధ్వర్యంలో టైలర్స్‌డేను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దశరథ్, కిషన్, శ్రీనివాస్, భరత్, సుదర్శన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నిశితలో ఫ్రెషర్స్ పార్టీ సందడి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిశిత కళాశాల డాటా సైన్స్ విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా జరిగింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్న ఈ ఫ్రెషర్స్ పార్టీలో విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. తృతీయ సంవత్సరం విద్యార్థులు కళాశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిఖిల్, చీఫ్ ప్యాట్రన్ వినయ్, కోఆర్డినేటర్ రాజు, డైరెక్టర్ ఓఎం షేక్, ప్రిన్సిపల్ స్వప్న పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినీలు



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89,200	రూ.82,300	రూ.1005

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1
: చావా (హిందీ)(10.15)
: శబ్దం (1.35)
: సంక్రాంతికి వస్తున్నాం (4.40)
: అగాథియా (7.50)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.40)

స్క్రీన్-2
: శబ్దం (10.05)
: చావా (హిందీ)(1.10, 7.35, 10.55)
: మజాకా (4.30)

స్క్రీన్-3
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.10)
: మజాకా (1.20)
: గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్ (హిందీ) (4.25)
: శబ్దం (7.40, 10.45)

స్క్రీన్-4
: నేనెక్కడున్నా (10.45)
: గార్డ్ (1.25)
: చావా (హిందీ) (4.00)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.20)
: మజాకా (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1
: చావా (హిందీ) (11.00, 4.40, 7.30, 10.20)
: అగాథియా (1.40)

స్క్రీన్-2
: అగాథియా (11.00, 4.40)
: మజాకా (1.45, 7.35, 10.30)

స్క్రీన్-3
: గార్డ్ (11.00)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (1.40, 7.30)
: శబ్దం (4.40, 10.20)

దేవి : మజాకా (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : చావా (హిందీ) (11.00, 2.00, 6.00, 9.00)

విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)

లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్